


# ఎల్ నీనోపై రైతులు అప్రమత్తంగా ఉండాలి... కలెక్టర్ దివాకర TS

**వనం నాగయ్య, కెరటం న్యూస్**

ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. ఎల్‌నినో పరిస్థితులు, జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, వ్యవసాయంపై ప్రభావం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ నిపుణుల అంచనాలు, జిల్లాలో నెలకొన్న పరిస్థితులను కలెక్టర్ వివరించారు.



జిల్లాకలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో ఎల్‌నినో ప్రభావం బలంగా ఉండే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. రెండు మూడు రోజుల పాటు వర్షాలు కురిసిన వెంటనే సాధారణ వర్షపాతం ఉంటుందని భావించి రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటల సాగుకు వెళ్లవద్దని సూచించారు. ఆకాశంలో మేఘాలు ఏర్పడినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం తక్కువగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారని తెలిపారు. రైతులు వర్షాలను మాత్రమే కాకుండా భవిష్యత్తులో నీటి లభ్యతను కూడా దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోకుండా నీటి ఆధారిత పంటలను సాగు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందుగానే ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, భూగర్భ జలాల లభ్యతపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

## భూగర్భ జలాలు 6.5 నుంచి 8 అడుగుల మేర తగ్గాయి

గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో ప్రస్తుతం భూగర్భ జల మట్టాలు సుమారు 6.5 నుంచి 8 అడుగుల మేర తగ్గాయని కలెక్టర్ తెలిపారు. బోర్లు ఉన్నాయనే కారణంతో వ్యవసాయం చేసుకోవచ్చని రైతులు భావించవద్దని సూచించారు. రానున్న నెలన్నర రోజుల్లో భూగర్భ జలాల లభ్యత మరింత తగ్గే అవకాశం ఉందని, ఈ పరిస్థితిని రైతులు ముందుగానే పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీరు అత్యంత విలువైన వనరులని, అందుబాటులో ఉన్న నీటిని ఆచితూచి వినియోగించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. వచ్చే జూలై వరకు అందుబాటులో ఉన్న భూగర్భ జలాలను త్రాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంటుందని అన్నారు. వ్యవసాయ అవసరాలతో పాటు భవిష్యత్తులో ప్రజల తాగునీటి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగంపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

## తక్కువ నీటి అవసరమయ్యే పంటల సాగుకు ప్రాధాన్యత

ప్రస్తుతం జిల్లాలో రైతులకు పొద్దు తిరుగుడు, పప్పుధాన్యాలు, కంది, పెసర తదితర తక్కువ నీటి అవసరమయ్యే పంటల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పప్పు ధాన్యాల విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నామని అన్నారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతులు భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని కోరారు.సత్తుపల్లి ప్రాంతంలో రైతులు విస్తారంగా వరి సాగు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అక్కడి రైతులకు ఇప్పటికే పలుమార్లు వరి సాగు చేయవద్దని సూచించామని పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితిపై వాస్తవ సమాచారాన్ని రైతులకు చేరవేయడంలో మీడియా కూడా కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ కోరారు.

## వర్షపాతం, భూగర్భ జలాల వివరాలను మీడియాకు అందించాలి

జిల్లాలో నమోదవుతున్న వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితికి సంబంధించిన సమాచారాన్ని క్రమం తప్పకుండా మీడియాకు అందించాలని కలెక్టర్ సీపీఓను ఆదేశించారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతపై ప్రజలకు, రైతులకు ఎప్పటి కప్పుడు వాస్తవ సమాచారాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో ముందస్తు అవగాహన కల్పించడం ద్వారా అధిక నీటి అవసరమయ్యే పంటల సాగును నియంత్రించవచ్చని, తద్వారా భవిష్యత్తులో నీటి సమస్యలను కొంతమేర నివారించవచ్చని కలెక్టర్ తెలిపారు.

## వర్షపు నీటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు

జిల్లాలో సోక్‌పిట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడంతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 80 వేల మంది రైతులను ఫామ్ పాండ్ల నిర్మాణానికి గుర్తించామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు సుమారు 3 వేల మంది రైతులు ఫామ్ పాండ్ల నిర్మాణానికి అంగీకారం తెలిపారని, అంగీకారం తెలిపిన రైతుల పొలాల్లో ఫామ్ పాండ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. మిగిలిన రైతులను కూడా ఫామ్ పాండ్ల నిర్మాణానికి అంగీకరించేలా అధికారులు అవగాహన కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ కోసం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్లను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

## వర్షాకాలం పూర్తయిన తర్వాతే కరువు పరిస్థితులపై నిర్ణయం

ప్రస్తుతం జిల్లాలో తక్కువ వర్షపాతం లేదా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని నిర్ధారించలేమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత విధానాల ప్రకారం వర్షాకాలం పూర్తయిన అనంతరం మాత్రమే వర్షపాతం, పంటల పరిస్థితి, ఇతర సంబంధిత అంశాలను పరిశీలించి తక్కువ వర్షపాతం లేదా కరువు పరిస్థితులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ అన్నారు. రైతులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు.అనంతరం పాత్రికేయులు ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం, భూగర్భ జలాలు, పంటల సాగు, రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాలు, నీటి సంరక్షణ, తదితర అంశాలపై అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. ఈ మీడియా సమావేశంలో ఇరిగేషన్ సిఈ వాసంతి, ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.